సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
మంగళవారం । 13 । జూన్ । 2023



నేటి నుంచి కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 2వ, 4వ, 6వ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. - 8లో▸



'గుడ్డు' గుటుక్కుమనదు!

అంగన్‌వాడీ కేంద్రాలకు జూలై నుంచి వచ్చే కోడిగుడ్లపై 'అంగన్‌వాడీ గుడ్డు' అని ముద్ర వేసి సరఫరా చేయనున్నారు. పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. - 9లో▸

గరిష్టం/కనిష్టం
$39.0^0 / 29.0^0$

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. పలు చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలి



భూపాలపల్లి: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలపై విచారణ జరిపి చట్టపరంగా న్యాయంచేయాలని ఎస్పీ జె.సురేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివస్ కార్యక్రమం సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన 14మంది బాధితుల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ.. పోలీస్ పరిధిలోని ప్రతీ అంశాన్ని చట్టపరిధిలో పరిష్కరించడంతోపాటు బాధితులకు న్యాయంచేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రేపు ఆస్పత్రిలో దశాబ్ది ఉత్సవాలు



చిట్యాల: వైద్య, ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రిలో బుధవారం దశాబ్ది ఉత్సవాలను నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆస్పత్రిలో జిల్లా వైద్యాధికారి శ్రీరాంతో కలిసి భూపాలపల్లి నియోజకవర్గంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ద్వారా చేపడుతున్న సంక్షేమ పథకాలను దశాబ్ది ఉత్సవాలలో ప్రజలకు వివరించాలన్నారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, సీఎంఆర్‌ఎఫ్ తీసుకున్న లబ్ధిదారులు ఎక్కువగా పాల్గొనేలా చూడాలన్నారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ జీడి తిరుపతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కొమురయ్య, వైద్యురాలు శ్రీదేవి పాల్గొన్నారు.

రేపటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

భూపాలపల్లి అర్బన్: ఈ నెల 14వ తేదీ నుంచి పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ డీఈఓ రాంకుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటల మధ్యాహ్నం 12.50 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

15న ఇంటర్వ్యూలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరాలయంలో ఖాళీగా ఉన్న శృతి, తాళం ఉద్యోగుల భర్తీకి అర్హులైన అభ్యర్థులకు ఈనెల 15న దేవస్థానం కార్యాలయంలో ఇంటర్వ్యూలు, ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు ఈఓ మహేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలతో ఏర్పాటు చేసిన సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 11గంటలకు ఇంటర్వ్యూ, ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కాల్‌లెటర్స్ పంపించినట్లు ఆయన తెలిపారు.

పిల్లలను పనిలో పెట్టుకోవద్దు



భూపాలపల్లి అర్బన్: పిల్లలను పనిలో కాకుండా పాఠశాలలకు పంపించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు తెలిపారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా కోర్టు ఆవరణ నుంచి కూరగాయల మార్కెట్ నుంచి జయశంకర్, అంబేద్కర్ సెంటర్ల మీదగా బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. బాలబాలికల మానసిక, శారీరక వికాసం మన అందరి బాధ్యత అన్నారు. 18 సంవత్సరాలలోపు బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్యను అందించాలన్నారు. బాల కార్మికులు ఉన్నట్లయితే 1098టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి రాంచందర్‌రావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, ఆనందరావు, డిపో మేనేజర్ ప్రతిమరెడ్డి, ఎస్సై ప్రశాంత్, బాలల సంరక్షణ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశుభ్రత ఎలా..!

మూడేళ్ల క్రితం స్కావెంజర్ల తొలగింపు

- పట్టించుకోని గ్రామపంచాయతీ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



భూపాలపల్లి అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం పదేళ్లుగా అటెండర్ల నియామకాలు చేపట్టడం లేదు. తాత్కాలికంగా నియమించినటువంటి స్కావెంజర్లను కూడా మూడేళ్ల క్రితం తొలగించింది. పాఠశాలలను శుభ్రం చేసే బాధ్యతలను మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులకు అప్పగించింది. కానీ జిల్లాలో పంచాయతీ సిబ్బంది అంతంత మాత్రమే పనులు చేస్తున్నారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో 429 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. సుమారు 28వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. 462మంది స్కావెంజర్లు ఉండగా ప్రభుత్వం మూడేళ్ల క్రితం తొలగించింది. పాఠశాలలను శుభ్రం చేసే బాధ్యతలను గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం అప్పగించింది. కానీ జిల్లాలో పంచాయతీ సిబ్బంది పూర్తిస్థాయిలో పనులు చేయడం లేదు.

జిల్లాలోని ఏ ఒక్క పాఠశాలలో కూడా సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని పలువురు ప్రధానోపాధ్యాయులు అంటున్నారు. దీంతో నిర్వహణ సక్రమంగా లేక ప్రభుత్వ బడులు అపరిశుభ్రతకు నిలయాలుగా మారుతున్నాయి.

ఉపాధ్యాయులకు ఇబ్బందులు

పాఠశాలల్లో స్కావెంజర్లు లేకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల్లో తాగునీరు తెచ్చే వారు, బెల్లు కొట్టే వారు, తరగతి గదులను శుభ్రం చేసేవారు కరువయ్యారు. ప్రతి మండలంలో ఒకటి రెండు పాఠశాలల్లో మాత్రమే ప్రభుత్వ అటెండర్లు, ఆఫీస్ సబార్డినేటర్లు ఉన్నారు. పారిశుద్ధ్య కార్మికులు అప్పుడప్పుడు కేవలం పాఠశాల ఆవరణలో మాత్రమే ఉదయం సమయంలో శుభ్రం చేసి వెళ్తున్నారని ఉపాధ్యాయులు అంటున్నారు. తరగతి గదుల్లో శుభ్రం చేయడం లేదని వాపోతున్నారు. దీంతో విద్యార్థులు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

స్కావెంజర్లను నియమించాలి..



స్కావెంజర్లను తొలగించడంతో బడులను శుభ్రపర్చేవారు కరువయ్యారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లోనే సిబ్బంది కొరత, పనిభారం ఉంది. పరిశుభ్రత బాధ్యత గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు అప్పగించినప్పటికీ వారు పట్టించుకోవడం లేదు. దీంతో ఉపాధ్యాయులకు అనేక రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వెంటనే స్కావెంజర్లను నియమించాలి.

– మధుసూదన్, ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు



జగదీశ్ కుటుంబసభ్యులను ఓదారుస్తున్న మంత్రి కేటీఆర్

కుసుమానికి కన్నీటి వీడ్కోలు

- అశ్రునయనాలతో ములుగు జెడ్పీ చైర్మన్ జగదీశ్ అంత్యక్రియలు
- పార్థివదేహంపై బీఆర్‌ఎస్ జెండా కప్పిన మంత్రి కేటీఆర్
- కుటుంబ సభ్యులకు ఓదార్పు.. అండగా ఉంటామని హామీ



నివాళులర్పిస్తున్న మంత్రి కేటీఆర్, కడియం, పెద్ది

బీఆర్‌ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ అంత్యక్రియలు సోమవారం తన స్వగ్రామమైన మల్లంపల్లిలో జరిగాయి. పార్టీ శ్రేణులు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్‌తోపాటు పలువురు మంత్రులు హాజరై నివాళులర్పించారు. జగదీశ్ పార్థివదేహంపై కేటీఆర్ బీఆర్‌ఎస్ జెండా కప్పి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. – ములుగు

- పూర్తి వివరాలు 8లో▸

14 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

- మహబూబాబాద్ ఎస్పీ శరత్ చంద్ర పవార్

మహబూబాబాద్ రూరల్: యూనిఫాం సర్వీసెస్ కొలువుల భర్తీలో భాగంగా తుది రాత పరీక్ష రాసిన వివిధ విభాగాల్లోని ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈ నెల 14నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభమవుతుందని మహబూబాబాద్ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సోమవారం తెలిపారు. మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు సంబంధించిన 7,034 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ మహబూబాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించాలని రిక్రూట్‌మెంట్ బోర్డు నుంచి ఆదేశాలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ నెల 14నుంచి 26వ తేదీ వరకు ప్రతీరోజు 600 మంది సర్టిఫికెట్లు పరిశీలిస్తామని, దీనికి జిల్లా పోలీసు యంత్రాంగం సిద్ధమవుతుందన్నారు. అభ్యర్థులు తమకు నిర్దేశించిన తేదీల్లో మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉదయం 9గంటలకు హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు కులం/కమ్యూనిటీ, ఈడబ్ల్యూఎస్, ఏజెన్సీ ఏరియా సర్టిఫికెట్, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్స్, జనన ధ్రువీకరణ పత్రం (చదువుకున్నప్పటి నుంచి), బోనఫైడ్, లోకల్/నాన్ లోకల్ రెసిడెన్షియల్ సర్టిఫికెట్, నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్, ఎక్స్ సర్వీస్‌మెన్ సర్టిఫికెట్, ఎంఎస్పీ, స్పోర్ట్స్, ఎన్‌సీసీ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. ఉదయం 300మంది, మధ్యాహ్నం 300మంది సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేస్తామన్నారు. అభ్యర్థులందరూ సకాలంలో అన్ని పత్రాలతో హాజరై జిల్లా పోలీస్ సిబ్బందికి సహకరించాలన్నారు.

దేశంలోనే నంబర్ వన్



రన్ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి: తెలంగాణ పోలీసులు దేశంలో నంబర్‌వన్‌గా నిలుస్తున్నారని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ స్టేడియం వద్ద 2కే రన్ నిర్వహించారు. ఎస్పీ సురేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ భవేష్‌మిశ్రా ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శాంతి భద్రతలు అదుపులో ఉంటేనే సమాజంలో ప్రశాంత జీవనం సాధ్యమవుతుందన్నారు. కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ఎస్పీ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 2కే రన్‌ను విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, అదనపు కలెక్టర్ టీఎస్ దివాకర, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్ధు, వైస్‌చైర్మన్ కొత్త హరిబాబు పాల్గొన్నారు.

జూలై 15 నాటికి పూర్తి

కలెక్టరేట్ పనులు జూలై 15 నాటికి పూర్తి చేయాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కలెక్టర్ భవేష్‌మిశ్రాతో కలిసి కలెక్టరేట్, మెడికల్ కాలేజీ పనులను పరిశీలించారు. అనంతరం అక్కడే అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరితగతిన చివరి దశ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆగస్టు మొదటి వారంలో సీఎం కేసీఆర్ సమయం తీసుకుని ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆగస్టు మాసంలో మెడికల్ కాలేజీ సీట్ల కౌన్సెలింగ్ ఉంటుందని.. ఆగస్టు నెలాఖరులో తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ.. జూలై 15 నాటికి కలెక్టరేట్ పనులు పూర్తి చేసేందుకు పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ టీఎస్ దివాకర, అధికారులు పాల్గొన్నారు.

చిట్యాల మండలం శాంతినగర్‌లో అగ్నిప్రమాదంలో చెలరేగుతున్న మంటలు (ఫైల్)



ఒకటే ఫైర్‌స్టేషన్

అందని అగ్నిమాపక సేవలు

- జిల్లాకేంద్రం నుంచి ప్రతి మండలం 30నుంచి 50కి.మీ దూరం
- ప్రమాదస్థలానికి చేరుకునేలోపే బుగ్గి..
- వేధిస్తున్న సిబ్బంది కొరత

కాటారం: జిల్లాలో ఒకటే ఫైర్‌స్టేషన్.. ఒకటే ఫైరింజన్.. దీంతో అత్యవసర సమయంలో జిల్లా ప్రజలకు అగ్నిమాపక సేవలు అందడం లేదు. జిల్లాలోని మండలాలు 30నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. దీంతో మారుమూల మండలాల్లో అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటే ఫైరింజన్ వెళ్లే సరికే ఆస్తులు కాలి బూడిదవుతున్నాయి. ఒకే సమయంలో రెండు ప్రాంతాల్లో ప్రమాదాలు చేటుచేసుకుంటే మాత్రం ఇబ్బందికర పరిస్థితి నెలకొంటుంది. 30 కిలోమీటర్ల వ్యవధిలో ఒక అగ్నిమాపక కేంద్రం ఉండాలనే నిబంధనలు ఉన్నా.. జిల్లా కేంద్రంలో తప్ప మరెక్కడా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా ఏర్పడి ఆరేళ్లు దాటినప్పటికీ ఫైర్‌స్టేషన్ ఏర్పాటులో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి.

జిల్లాలో 11 మండలాలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ భవనంలో ఓ చిన్నగదిలో ఫైర్‌స్టేషన్ కొనసాగుతోంది. జిల్లాకేంద్రం నుంచి పలిమెల మండలకేంద్రం 65 కిలోమీటర్లు, మహదేవపూర్ 40, కాళేశ్వరం 55, మల్హర్ 50, టేకుమట్ల 35 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. మిగతా మండలాలు 20 కిలోమీటర్ల నుంచి 30 మధ్యలో ఉన్నాయి. దీంతో పై మండలాల్లో ఏమైనా అగ్ని ప్రమాదాలు జరిగితే భూపాలపల్లి జిల్లాకేంద్రం నుంచి ఫైరింజన్ వెళ్లే సరికే ఆస్తులు కాలి బూడిదవుతున్నాయి. ఎక్కువగా అటవీ ప్రాంతాల మండలాలు కావడంతో నిత్యం ఎక్కడో ఒక చోట ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో లక్షలాది రూపాయల ఆస్తినష్టం జరుగుతుంది. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా కొడుతుండడంతో ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయి. సేవలు మాత్రం సకాలంలో అందక ప్రజలు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు.

ఫైర్‌స్టేషన్‌కు సొంత భవనం కరువు..

జిల్లా కేంద్రంలోని ఫైర్‌స్టేషన్ మున్సిపల్ భవనంలోని ఓ చిన్నగదిలో కొనసాగుతోంది. ఏడేళ్లుగా సొంత భవనానికి నోచుకోవడం లేదు. ఫైర్‌స్టేషన్ ఏర్పాటు కోసం గతంలో భూపాలపల్లి పట్టణ పరిధిలోని జంగేడు శివారులో రెండెకరాల స్థలాన్ని కేటాయించారు. వివిధ కారణాలతో ఆ స్థలం దక్కలేదు. ఇటీవల మంజూర్‌నగర్ సమీపంలో స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. ఇందులో అగ్నిమాపకశాఖ స్థలమంటూ సంబంధిత అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. కానీ నిర్మాణానికి నిధులు మాత్రం మంజూరు కాలేదు.

20మందికి.. ఏడుగురే..

జిల్లా అగ్నిమాపక శాఖలో అధికారులు, సిబ్బంది కలిసి సుమారు 20మంది వరకు ఉండాల్సి ఉండగా ఏడుగురు మాత్రమే కొనసాగుతున్నారు. స్టేషన్ ఫైర్‌ఆఫీసర్ పోస్టు సైతం ఖాళీగా ఉంది. ప్రస్తుతం పరకాల స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలతో వ్యవహరిస్తున్నారు. లీడింగ్ ఫైర్‌మెన్ ఇద్దరు, డ్రైవర్ ఆపరేటర్లు ముగ్గురు ఉండాల్సి ఉండగా ఒకరు మాత్రమే పర్మినెంట్‌గా ఉన్నారు. ఇద్దరు ఆర్టీసీ సిబ్బందిని డ్రైవర్లుగా తాత్కాలికంగా కొనసాగిస్తున్నారు. ఫైర్‌మన్లు పదిమంది ఉండాల్సి ఉండగా నలుగురే విధులు నిర్వర్తిసున్నారు.

ఇటీవల జరిగిన అగ్నిప్రమాదాలు

- రేగొండ మండలకేంద్రంలో తాటివనానికి నిప్పు అంటుకోవడంతో 50తాటిచెట్లు దగ్ధమయ్యాయి.
- చిట్యాల మండలం శాంతినగర్‌లో మూడు ఇళ్లు అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయి. సుమారు రూ.6లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది.
- టేకుమట్లలో విద్యుదాఘాతంతో ఇళ్లు అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.2.50 లక్షల మేర ఆస్తినష్టం జరిగింది.
- మహాముత్తారం మండలం పెగడపల్లిలో గుడిసె అగ్నిప్రమాదంలో దగ్ధమవగా రూ.లక్ష మేర నష్టం వాటిల్లింది.
- మల్హర్ మండలం నాచారంలో విద్యుదాఘాతంతో ఇళ్లు కాలిపోయింది. సుమారు రూ.3లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లింది.
- కాటారం మండలం దామెరకుంట వద్ద పశుగ్రాసం తరలిస్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తాకడంతో ట్రాలీతో సహా పశుగ్రాసం దగ్ధమైంది. సుమారు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లింది.
- కాటారం మండలం ఆదివారంపేటలో సుమారు వంద ఎకరాల మేర పంటపొలాల్లోని పశుగ్రాసానికి నిప్పంటుకొని దగ్ధమైంది. సుమారు రూ.6లక్షల విలువ చేసే పశుగ్రాసం కాలిబూడిదైంది.

సమయానికి స్పందిస్తున్నాం..

జిల్లాలో అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు సమాచారం అందిన వెంటనే స్పందిస్తున్నాం. దూరం, వాతావరణ పరిస్థితులు లెక్క చేయకుండా ఫైర్ సిబ్బంది ఫైరింజన్‌తో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పుతున్నారు. జిల్లా మొత్తం ఒకే ఫైరింజన్ ఉండటంతో ఒకే సమయంలో రెండు, మూడు ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయినప్పటికీ అగ్నిమాపక సేవలు మాత్రం ఖచ్చితంగా అందిస్తున్నాం. జిల్లా అగ్నిమాపక శాఖలో కొన్ని సమస్యలు నెలకొన్నది వాస్తవమే.

– రాజేందర్, ఇన్‌చార్జ్ ఫైర్ ఆఫీసర్

తాగునీటి, పల్లెప్రగతి దినోత్సవాలకు ఏర్పాట్లు

- పారదర్శకంగా ఈవీఎం యంత్రాల ఎఫ్‌ఎల్‌సీ నిర్వహణ
- కలెక్టర్ భవేష్ మిశ్రా



ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్

భూపాలపల్లి: జూన్ 18న ప్రతీ గ్రామంలో తాగునీటి, జూన్ 15న పల్లె ప్రగతి దినోత్సవాలు నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఇల్లందు అతిథి గృహంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం మిషన్ భగీరథ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ పథకం కింద జిల్లాలోని మున్సిపాలిటీకి, గ్రామాలకు బల్క్ నీటి సరఫరా అందిస్తుందని, 425 ఆవాసాలకు మిషన్ భగీరథ ఇంటర్ పనులు పూర్తిచేసి నల్లా ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని తెలిపారు. జూన్ 18న నిర్వహించే తాగునీటి దినోత్సవానికి ముందస్తుగా పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలోని ఆవాసాలలో పర్యటించి తాగునీటి సరఫరాకు సంబంధించి క్షేత్రస్థాయి సమాచారం సేకరించాలని ఆదేశించారు. జూన్ 18న జిల్లాలోని సర్పంచ్‌లు ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులతో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ సందర్శన చేయాలని, ఇందుకోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు ఎలా శుద్ధి చేసి గ్రామాలకు సరఫరా చేస్తున్నామో ప్రజాప్రతినిధులకు వివరించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో చాలా మందికి కుర్చీలు లేకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, డీపీఓ ఆశాలత, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారదర్శకంగా నిర్వహణ..

జూన్ 12 నుంచి 22 వరకు పారదర్శకంగా ఈవీఎం యంత్రాలను ఎఫ్‌ఎల్‌సీ(ఫస్ట్ లెవల్ చెకింగ్) ఈసీఐఎల్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం ఈవీఎం గోదాం కేంద్రం వద్ద ఈవీఎం మిషన్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. జూన్ 12 నుంచి జూన్ 22 వరకు ఈవీఎం యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ నలుగురు ఈసీఐఎల్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మన జిల్లాకు వచ్చిన 574 బ్యాలెట్ యూనిట్లు, 448 కంట్రోల్ యూనిట్లు, 483 వీవీ ప్యాట్ల యంత్రాల పనితీరు పరిశీలించనున్నట్లు చెప్పారు. మూడు రోజుల క్రితం అన్ని రాజకీయ పక్షాలకు సమాచారం అందించామన్నారు. జూన్ 22 వరకు ప్రతీరోజు ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా ఈవీఎం యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈవీఎం యంత్రాలపై అనుమానాలకు తావు లేకుండా ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. చెకింగ్ ముగిసిన తర్వాత వేయి ఓట్లతో మాక్ పోలింగ్ నిర్వహిస్తామని, అప్పుడు కంట్రోల్ యూనిట్‌లో వచ్చిన ఓటు వివరాలు వీవీ ప్యాట్ స్లిప్పుల వివరాలను చెక్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ ఇక్బాల్, ఎన్నికల సిబ్బంది, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

5 రోజులు వ్యవసాయ మార్కెట్ బంద్



వరంగల్ : వరంగల్ ఏనుమాముల మార్కెట్ ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు 5 రోజులు బంద్ ఉంటుందని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఎండల తీవ్రత కారణంగా గుమస్తా, హమాలీల విజ్ఞప్తి మేరకు ఛాంబర్ ఆఫ్ కామర్స్ – ఇండస్ట్రీస్ లేఖతో బుధ, గురు, శుక్ర వారాల్లో సెలవులు ప్రకటిస్తున్నామన్నారు. 17వ తేదీ శనివారం యార్డు బంద్, 18వ తేదీ ఆదివారం వారాంతపు సెలవులతో మొత్తం ఐదురోజులు మార్కెట్ బంద్ ఉంటుందన్నారు. 19వ తేదీన మార్కెట్ పునఃప్రారంభం అవుతుందన్నారు. ఈ విషయాన్ని రైతులు, వ్యాపారులు గమనించాలని కోరారు.

ములుగు జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న యాదవరెడ్డి, కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యే పెద్ది, చెరుకు సుధాకర్, ఎమ్మెల్సీలు కడియం, సారయ్య, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, ఎమ్మెల్యే సీతక్క, ఎంపీ దయాకర్



కుసుమానికి కన్నీటి వీడ్కోలు

అశ్రునయనాలతో ములుగు జెడ్పీ చైర్మన్ జగదీశ్ అంత్యక్రియలు

- చివరి చూపునకు తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు
- పార్థివదేహంపై బీఆర్ఎస్ జెండాకప్పిన మంత్రి కేటీఆర్
- కుటుంబ సభ్యులకు ఓదార్పు.. అండగా ఉంటామని హామీ
- పాడె మోసిన మంత్రులు, ప్రజాప్రతినిధులు
- జనసంద్రంగా మారిన మల్లంపల్లి



అంతిమ యాత్రకు హాజరైన ప్రజాప్రతినిధులు, ప్రజలు

ములుగు: బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్‌కు సోమవారం అభిమానులు, పార్టీ కార్యకర్తలు కన్నీటి వీడ్కోలు పలికారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో మల్లంపల్లి జనసంద్రమైంది. జగదీశ్ ఆదివారం గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. ఆస్పత్రినుంచి ఆయన పార్థివదేహాన్ని తన స్వగ్రామమైన మల్లంపల్లికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. ఆయన చేసిన మేలును గుర్తుచేసుకొని కన్నీటి పర్యంతమయ్యారు.

అధికార లాంఛనాలతో..

సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అధికార లాంఛనాలతో కుసుమ జగదీశ్ అంత్యక్రియలు నిర్వహించారు. పోలీస్ శాఖ భారీ బందోబస్తు నిర్వహించింది. సుమారు గంటపాటు జరిగిన అంతిమయాత్రలో ఎండను సైతం లెక్కచేయకుండా అభిమానగణం పాల్గొంది. కుమారుడు వెంకట సత్యదేవ్ కుండపట్టారు. మధ్యాహ్నం 12: 35 గంటల సమయంలో స్థానిక వారి సొంతభూమిలో సంప్రదాయబద్ధంగా ఖననం చేశారు.

హాజరైన మంత్రి కేటీఆర్

రాష్ట్ర ఐటీ, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ సోమవారం ఉదయం జగదీశ్ అంత్యక్రియలకు హాజరయ్యారు. బేగంపేట నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మంత్రి పువ్వాడ అజయ్‌తోపాటు ఎంపీ సంతోష్ కుమార్, ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎంపీ రంజిత్ కుమార్ రెడ్డితో కలిసి వచ్చారు. జగదీశ్ భౌతికకాయంపై బీఆర్ఎస్ జెండా కప్పారు. పూలమాల వేసి నివాళులర్పించారు. పక్కనే ఉన్న తల్లి సులోచన, భార్య రమాదేవి, కుమార్తె హరిచందన, కుమారుడు సత్యదేవ్‌లు కేటీఆర్‌ను చూసి బోరున విలపించారు. దీంతో వారిని దగ్గరికి తీసుకొని ఓదార్చారు.

జనసంద్రంగా.. అంతిమయాత్ర

జగదీశ్ అంతిమయాత్ర జనయాత్రగా మారింది. ములుగు జిల్లాతోపాటు ఉమ్మడి వరంగల్, హైదరాబాద్, నల్లగొండ, కరీంనగర్ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులతో ములుగు, నర్సంపేట దారి కిక్కిరిసిపోయింది. మల్లంపల్లిలో చదువుకున్న 1991వ బ్యాచ్ మిత్రులు హాజరై జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఎస్పీ గాష్‌ఆలం ఆధ్వర్యంలో పోలీసులు ప్రధాన దారిని వన్ వేగా మార్చారు. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల వాహనాలను మాత్రమే అనుమతించారు. జగదీశ్‌తో ఉన్న సన్నిహితంతో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ కవిత సోమవారం ఉదయం నుంచి అంత్యక్రియల ఏర్పాట్లను దగ్గరుండి చూసుకున్నారు. అంతకుముందు మంత్రి సత్యవతి, ఎంపీ కవిత, తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు పాడె మోసి అభిమానం చాటుకున్నారు.



జగదీశ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేటీఆర్



జగదీశ్ తల్లిని ఓదార్చుతున్న మంత్రి ఎర్రబెల్లి

ఆత్మీయ సోదరుడిని కోల్పోయా : కేటీఆర్

రెండు దశాబ్దాలపాటు సీఎం కేసీఆర్‌తోపాటు ఉద్యమంలో నిలిచి ఉత్తముడిగా ఉన్నాడు. నాకు ఆత్మీయ సోదరుడిగా ఉన్న జగదీశ్‌ను కోల్పోవడం బాధగా ఉంది. సీఎం ఏ పని చెప్పిన వెనుకడుగు వేయకుండా చేశాడు. చిన్న వయసులోనే మృతిచెందడం బాధాకరం. ప్రభుత్వం తరఫున కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటాం.

ప్రముఖుల నివాళి

జగదీశ్ పార్థివదేహాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, పువ్వాడ అజయ్, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, చీఫ్‌విప్ వినయ్ భాస్కర్, విప్ ప్రభాకర్‌రావు, స్థానిక ఎమ్మెల్యే సీతక్క, ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, అరూరి రమేశ్, బానోత్ శంకర్ నాయక్, గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ, రాష్ట్ర రైతుబంధు సమితి చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజ్ సారయ్య, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, వరంగల్, మహబూబాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్స్ గండ్ర జ్యోతి, ఆంగోత్ బిందు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరమల్ల ప్రకాష్‌రావు, రెడ్‌కో చైర్మన్ యారువ సతీ ష్ రెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణ మోహన్‌రావు, కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఐటీడీఏ పీఓ అంకిత్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బు చ్చయ్య, హనుమకొండ, ములుగు గ్రంథాల య సంస్థ చైర్మన్‌లు అజీజ్ ఖాన్, గోవింద్ నాయక్, జెడ్పీటీసీలు సకినాల భవాణి, రుద్రమాదేవి, తుమ్మల హరిబాబు, ఎంపీపీ శ్రీదేవి, మాజీ ఎంపీ సీతారాంనాయక్, అధికారులు ఉన్నారు.

నేటి నుంచి కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

- హాజరుకానున్న 1,81,286 మంది విద్యార్థులు
- 131 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ, బీఎల్‌బీ, ఒకేషనల్ కోర్సుల్లో 2వ , 4వ, 6వ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి నరేందర్ సోమవారం తెలిపారు. రెండో సెమిస్టర్‌కు 71,204 మంది, 4వ సెమిస్టర్‌లో 64,900 మంది, 6వ సెమిస్టర్‌లో 45,182 మంది విద్యార్థులు మొత్తం 1,81, 86 మంది పరీక్షలు రాయబోతున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో 48 , ఆదిలాబాద్ జిల్లాలో 50, ఖమ్మం జిల్లాలో 33 మొత్తం 131 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 13, 15, 17, 20, 22, 24, 27, 30, జూలై 4 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారు. 4వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 14,16, 19, 21, 23, 25, 28, జూలై 3, 5, 7వ తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. 6వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 13, 15, 17, 20, 22, 24, 27, 30, జూలై 4, 6,10, 11, 12, 13, 14 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారని వారు తెలిపారు.

దేశాన్ని ముందుకు నడిపించేది వ్యవసాయమే..

- సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ
- తాళ్లపూసపల్లిలో రైతు శిక్షణ శిబిరం



రైతులకు ప్రశంసపత్రాలు అందజేస్తున్న సీబీఐ మాజీ జేడీ

కేసముద్రం: దేశాన్ని ముందుకు నడిపించేది కేవలం వ్యవసాయమేనని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని తాళ్లపూసపల్లిలో రైతు జైపాల్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఎన్‌డ్రాపోడ్, ఆదిగురు భారత సంఘం, అరబిందో ఫార్మా ఫౌండేషన్, జేడీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేంద్రియ పంటలు–గో ఆధారిత వ్యవసాయంపై రైతు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా విపత్కర పరిస్థితుల్లో దేశంలోని ప్రజలు, వలసలు వచ్చిన వారికి ఆహారాన్ని అందించింది వ్యవసాయమేనన్నారు. గతంలో అమెరికా నుంచి పడవ వస్తేనే మనకు ఆహారమని, కాని ఇప్పుడు మనదేశం ప్రపంచంలోని 70 దేశాలకు అందించే స్థాయికి ఎదిగిందన్నారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ చెప్పారని, అంటే మన దేశం ఏ స్థాయిలో ఉందనేది అర్థమవుతుందన్నారు. స్వామినాథన్ కమిషన్ ప్రకారంగా గిట్టుబా టు ధరను, పంట భీమాను ప్రభుత్వాలు అందించాలన్నా రు. రాజమండ్రిలోని ధర్మవరంలో తాను 12 ఎకరాల భూ మిని కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నానని, రైతుల కష్టాలు తనకు తెలుసన్నారు. ప్రకృతిసాగును క్రమక్రమంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. అనంతరం ఆ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్కగానుగ నూనె యంత్రాన్ని ప్రారంభించారు. సేంద్రియ పద్ధతుల్లో సాగుచేస్తున్న రైతులను సన్మానించారు. కేవీకే కోఆర్డినేటర్ మాలతి, జీవీఆర్‌హెచ్‌ఆర్ భాస్కర్, వెంకట్రాంరెడ్డి, రమేష్, రైతులు పాల్గొన్నారు.

శుభకార్యానికి వెళ్లొస్తూ దుర్మరణం..

- వరంగల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- భార్య మృతి.. భర్త పరిస్థితి విషమం
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు



సుమతి (ఫైల్)

ఖిలా వరంగల్: మరో రెండు అడుగులు వేస్తే ఇంట్లోకి క్షేమంగా చేరుకునే వారు.. ఆ లోపే ఆ దంపతులను మృత్యువు వెంటాడింది. ఆటో దిగి రోడ్డు క్రాస్ చేస్తుండగా వేగంగా వస్తున్న క్రేన్ వెహికల్ వారిని ఢీకొంది. దీంతో భార్య అక్కడిక్కడే దుర్మరణం చెందగా భర్త తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు . ఈ హృదయ విదారక ఘటన పలువురిని కంటతడికి గురిచేసింది. వివరాల్లోకి వెళ్తే వరంగల్ ఫోర్ట్ రోడ్డు విద్యానగర్ కాలనీకి చెందిన కాలువ సుమతి (82) , బాలరాజు (82) దంపతులు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరిగిన శుభకార్యానికి వెళ్లి సోమవారం ఉదయం 5గంటలకు వరంగల్‌కు చేరుకున్నారు. వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ జంక్షన్‌లో ఆటో ఎక్కి ఇంటికి బయల్దేరారు. వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని సాయిబాబా గుడి కమాన్ సమీపంలో ఆటో దిగి రోడ్డు క్రాస్ చేస్తుండగా వరంగల్ నుంచి వేగంగా వస్తున్న క్రేన్ వెహికల్ వారిని ఢీకొంది. దీంతో సుమతి అక్కడికక్కడే దుర్మరణం చెందగా బాలరాజు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే బాలరాజును 108లో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారని బంధువులు తెలిపారు. ఘటన స్థలానికి మిల్స్‌కాలనీ పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు. విషయం తెలిసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనతో విద్యానగర్ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అశ్రునయనాల మధ్య భవ్య అంత్యక్రియలు

- జిల్లేడు చెట్టుకు పెళ్లి.. అనంతరం దహన సంస్కారాలు
- గ్రామంలో మిన్నంటిన రోదనలు
- ముగ్గురిపై కేసు నమోదు



భవ్య అంతిమయాత్రలో గ్రామస్తులు

కురవి: ప్రియుడు పెళ్లికి నిరాకరించడం.. పెద్దలు పంచాయితీ చేయడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన బీటెక్ విద్యార్థిని సాతర్ల భవ్య అంత్యక్రియలు సోమవారం అశ్రునయనాల మధ్య జరిగాయి. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నేరడ గ్రామంలో భవ్యకు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. పోస్టుమార్టం అనంతరం భవ్య మృతదేహాన్ని పోలీసుల భారీ బందోబస్తు మధ్య గ్రామానికి తీసుకొచ్చారు. అనంతరం భవ్యకు, జిల్లేడు చెట్టుకు పెళ్లి చేశారు. ఈ సమయంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. అనంతరం భవ్య మృతదేహాన్ని శ్మశానవాటిక వద్దకు తీసుకెళ్లి అంత్యక్రియలు జరిపించారు. కాగా, మృతురాలి తల్లి ఉమ ఫిర్యాదు మేరకు ప్రియుడు రుద్రారపు వినయ్, అతడి తల్లిదండ్రులు శ్రీనివాస్, సుభద్రపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాము సోమవారం తెలిపారు.

భార్య, పాపను చూసేందుకు వెళ్తూ మృత్యుఒడికి..

- రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



యాకాంబ్రం (ఫైల్)



పాడె మోస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

నెక్కొండ/ కేసముద్రం : తనకు మరో మహాలక్ష్మి జన్మించిందనే సంతోషంతో ఓ వ్యక్తి.. బైక్‌పై భార్య, పాపను చూసేందుకు వెళ్తున్నాడు. ఈక్రమంలో మృత్యువు రోడ్డు ప్రమాద రూపంలో అతనిని కబలించింది. ఈ ఘటన సోమవారం నెక్కొండ మండల కేంద్రంలో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం (స్టేషన్)లోని కిష్టాపురానికి చెందిన మందాటి యాకాంబ్రం (37) కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. 9 సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన లావణ్యను కులాంతర వివాహం చేసుకోగా ఆ దంపతులకు కూతురు ఆరేళ్ల అరణ్య ఉంది. ఈ క్రమంలో ఈ నెల 11న వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రిలో రెండో సంతానంగా పాప జన్మనించింది. ఈ విషయం తెలుసుకున్న యాకాంబ్రం అదే రోజు రాత్రి తన భార్య, పాపను చూసేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అప్పల్‌రావుపేట– నెక్కొండ రహదారి వద్ద చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై మృతుడి తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జానీపాషా తెలిపారు. కాగా, యాకాంబ్రం తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పనిచేశారు. 2011 ఫిబ్రవరి 22, 23 తేదీలలో 48 గంటల రైల్ రోకో చేపట్టారు. ఈ సమయంలో మణుగూరు ప్యాసింజర్‌కు నిప్పు పెట్టిన ఘటనలో యాకాంబ్రం ప్రధాన నిందితుడు. కాగా, ఎమ్మెల్యే శంకర్‌నాయక్.. యాకాంబ్రం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యాకాంబ్రం పాడె మోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

నూకశాతం అధికంగా ఉండే ధాన్యం తీసుకోం

- రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్‌కుమార్

న్యూశాయంపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రారైస్ ఎఫ్‌సీఐ ద్వారా మాత్రమే సేకరిస్తున్న నేపథ్యంలో అధిక నూక శాతం కలిగిన 1001 ధాన్యాన్ని భవిష్యత్‌లో దిగుమతి చేసుకోబోమని వరంగల్ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సంపత్ కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ రకం ధాన్యాన్ని తాము సేకరిస్తే ఎఫ్‌సీఐ తిరస్కరిస్తోందన్నారు. గత సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో సేకరించిన లక్షకు పైగా టన్నుల ధాన్యం నిల్వలు మిల్లుల లోనే పోరుకుపోయాయన్నారు. దీంతో మిల్లర్లు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా ఫలితం దక్కలేదన్నారు. తమ బాధను అర్థం చేసుకుని రైతులు 2023–24 ఖరీఫ్ సీజన్‌లో 1001 రకం వరి సాగు చేపట్టొద్దన్నారు. వానాకాలంలో ఎంటీయూ, ఎంటీయూ1061, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ, సోనా, బీపీటీ, 5204, స్వర్ణ తదితర రకాలను పండించాలని సూచించారు. అలాగే, వ్యాపారులు కూడా 1001 రకం విత్తనాలు విక్రయించకుండా తమకు సహకరించాలన్నారు.

నిట్‌లో అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్‌లో ఎంటెక్



మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ

కాజీపేట అర్బన్ : దేశంలోనే తొలిసారి నిట్ వరంగల్‌లో అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ విభాగంలో ఎంటెక్ కోర్సును ప్రారంభించినట్లు నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ తెలిపారు. నిట్ సెమినార్ హాల్‌లో సోమవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(డీఎస్టీ) యాక్సలరేటెడ్ విజ్ఞాన్ ప్రాజెక్ట్‌లో భాగంగా 'మెటీరియల్ సైన్స్ అండ్ అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్' అనే అంశంపై ఏర్పాటు చేసిన హై ఎండ్ రీసెర్చ్ ట్రైనింగ్‌ను ప్రారంభించి మాట్లాడారు. నిట్ వరంగల్‌లో మెటల్ త్రీడీ ప్రింటింగ్ అందుబాటులో ఉందని, నేషనల్ సెంటర్ ఫర్ అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్‌తో నిట్ ఎంవోయూ కుదుర్చుకుందని తెలిపారు. నిట్ వరంగల్ బెంగుళూరులోని సీఎంటీఐ సౌజన్యంతో అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్‌లో ఎంటెక్ కోర్సును ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీఎస్ఐఆర్ ,సీజీసీఆర్ఐ చీఫ్ సైంటిస్ట్ వంశీకృష్ణ, బెంగుళూరు జీఈ ఏవియేషన్స్ ప్రొఫెసర్ ఉమామహేశ్వర్, మంజయ్య, రవికుమార్, ఆడెపు కుమార్, సురేశ్‌బాబు, రీసెర్చ్ స్కాలర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఈ మాస్ట్‌ల తరలింపు..



కాజీపేట నుంచి వాహనాల్లో తరలుతున్న ఆర్ఈ మాస్ట్‌లు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌కు 3వ లైన్ నిర్మాణంలో భాగంగా విద్యుత్ ఏర్పాటు కోసం ఆర్ఈ మాస్ట్‌లు కాజీపేట జంక్షన్ నుంచి (3వ లైన్ నిర్మాణం పూర్తయిన తర్వాత ట్రాక్‌కు పక్కన ఏర్పాటు చేసే విద్యుత్ స్తంభం) తరలిస్తున్నారు. కాజీపేట–బల్లార్షా, కాజీపేట–విజయవాడ మార్గాలలో 3వ లైన్ నిర్మాణంలో భాగంగా ఓహెచ్‌ఈ విద్యుత్ విభాగానికి సంబంధించిన ఆర్ఈ మాస్ట్‌లను భారీ వాహనాలలో ఆయా రూట్‌లకు తరలిస్తున్నట్లు కాజీపేట రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. కాగా, ఈ ఆర్ఈ మాస్ట్‌లు ఏర్పాటు చేసిన తర్వాత విద్యుత్ విభాగం అధికారులు ఓహెచ్‌ఈ విద్యుత్ కనెక్షన్ ఇచ్చిన అనంతరం రైళ్ల ట్రాఫిక్ కొనసాగుతుందని తెలిపారు. కాగా, భారీ వాహనాలలో తరలిస్తున్న ఈ ఆర్ఈ మాస్ట్‌లను ప్రజలు ఆసక్తిగా తిలకించారు.